క్లుప్తంగా

వలంటీర్లకు సన్మానం

ఆస్పరి: మండలంలోని వలంటీర్లను శుక్రవారం సేవా పురస్కారాలతో సన్మానించనున్నట్లు ఎంపీడీఓ రాధ తెలిపారు.ఆమె గురువారం మాట్లాడుతూ 244 మంది సేవా మిత్ర, ఒకరికి సేవా వజ్ర, ఆరుగురికి సేవా రత్న అవార్డులు అందించనున్నట్లు చెప్పారు. ఆస్పరి సచివాలయంలో వలంటీర్ల సన్మాన కార్యక్రమం ఉంటుందని, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఏడీఏ తనిఖీలు



దేవనకొండలో మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆలూరు ఏడీఏ సునీత

దేవనకొండ: ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీత హెచ్చరించారు. ఆమె గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మన గ్రోమోర్ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన రికార్డులను ఏఓ సురేష్‌బాబు సమక్షంలో పరిశీలించారు. సరైన బిల్లులు లేకుండా రూ.6.5 లక్షల స్టాకు గోల్‌మాల్ చేసినట్లు తేల్చారు. అక్రమాలకు పాల్పడిన వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. మండలంలో పురుగు మందులు, ఎరువులు లూజ్ పత్తి విత్తనాలు అధిక ధరకు రైతులకు విక్రయించి నగదును సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. ఎరువులు, విత్తనాలు కొన్న షాపు యజమానుల నుంచి తప్పనిసరిగా రసీదులను పొందాలన్నారు. పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం హర్షణీయం

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి అని మారోమారు నిరూపితమైందని మండల కో–ఆప్షన్ సభ్యుడు బ్లూంసుడియో చాంద్‌బాషా అన్నారు. పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడం పట్ల గురువారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే ఒక్కో యాత్రికుడిపై పడుతున్న రూ.80 వేల అదనపు భారాన్ని భరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ముస్లింల పవిత్ర యాత్రకు ఆటంకం కలగకుండా అదనపు భారాన్ని భరించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు, సహకరించిన డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెద్ద ఈరన్న (ఫైల్)

నందవరం: గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న (45) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. 6వ తేదీ శనివారం సాయంత్రం ఈరన్నపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గాయపడిన ఈరన్నను చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. 9 రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. ఇంటి వద్ద కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలను గురువారం ఆర్ఎండీటీ కన్సల్టేషన్ అనే థర్డ్ పార్టీ సంస్థ తనిఖీ చేసింది. పట్టణంలోని 18వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు మహబుబ్‌నగర్ కాలనీ, న్యూఇందిరా నగర్ ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను డ్రిల్లింగ్ చేసి పరిశీలించినట్లు మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆ సంస్థ ఇంజనీర్ దీపక్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: నకిలీ, నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తున్న వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వాటి విక్రయాలను అరికట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, పట్టణ సీపీఐ కార్యదర్శి రంగన్న కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభమౌతున్నందున వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ, నాణ్యత లేని విత్తనాలను అంటగడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ అధికారులు కేవలం తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారన్నారు. పత్తి, మిరప విత్తనాలను అమ్మే డీలర్లు జీరో బిజినెస్ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని కోరుతూ 20వ తేదీన వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, బిటి.చిన్నన్న పాల్గొన్నారు.

సేవకు సముచిత గౌరవం

- నేడు వలంటీర్లను సత్కరించి అవార్డులు అందజేయనున్న అధికారులు
- ఆలూరు నియోజకవర్గంలో 5 మందికి సేవా వజ్ర, 30 మందికి సేవా రత్న, 1,179 మందికి సేవా మిత్ర అవార్డులు



ఆలూరులో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు (ఫైల్)

ఆలూరు రూరల్: ప్రభుత్వ పథకాలను అందరికీ దరిచేర్చారు. పేదల కన్నీళ్లను తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకొచ్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీ తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు కొత్త ఒరవడి సృష్టించారు. వీరు చేస్తున్న సేవకు ప్రభుత్వం నేడు ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తోంది.

కొత్త ఆలోచనలతో వలంటీర్ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీవం పోశారు. ఆ బాధ్యతలు తీసుకున్న వారంతా యువ సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హులకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు మెచ్చి ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. నేడు (శుక్రవారం) ఈ అవార్డులను ఆయా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అందించనున్నారు. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేలు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్ అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారు. సేవా పురస్కారాలతో పాటు వలంటీర్లను బ్యాడ్జీతో పాటు శాలువాతో సత్కరించనున్నారు.

నియోజకవర్గంలో 1,179 మందికి పురస్కారాలు

ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో మొత్తం 97 సచివాలయాల పరిధిలో 1,179 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ఇందులో ఆలూరు మండలం అరికెర సచివాలయం వలంటీర్, ఆస్పరి మండలం తంగరడోణ,దేవనకొండ మండలంకరివేముల, పి.కోటకొండ గ్రామసచివాలయాల్లో పని చేసే వలంటీర్లు, హాలహర్వి మండలం నిట్రవట్టి సచివాలయ వలంటీర్‌కు సే వావజ్ర అవార్డులు దక్కాయి. గ్రామాల్లో ఉత్తమ సేవలందించిన 30మంది వలంటీర్లకు సేవారత్న పురస్కా రాలు మిగిలిన 1,144 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డు ప్రకటించారు. దీనికి సంబంధించి అన్ని సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు అ వార్డులకు ఎంపికైన వలంటీర్ల జాబితాతో పా టు పథకాలు, షీల్డులు, బ్యాడ్జీలు, శాలువాలు పంపించారు.

వలంటీర్లకు అవార్డులు

తుగ్గలి: ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లకు ప్రత్యేక పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తుంది. మండలంలో మొత్తం 262 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో జీ.ఎర్రగుడి సచివాలయంకు చెందిన జిట్టా చిన్న కదిరప్ప సేవా వజ్ర, బండపల్లి మల్లికార్జున (శభాష్‌పురం), అశోక్ (తుగ్గలి), కవిత (జొన్నగిరి–2), ఆటక రంగస్వామి (ముక్కెల్ల), బచ్చు గురుస్వామి (మారెల్ల) సేవా రత్నకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 23 నుంచి నిర్వహించే కార్యక్రమాల్లో పురస్కారాలు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా గురువారం తెలిపారు.

మండలాల వారీగా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లు

మండలం	వలంటీర్లు	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర
ఆలూరు	218	1	5	212
ఆస్పరి	250	1	5	244
చిప్పగిరి	115	0	5	110
దేవనకొండ	277	2	5	267
హాలహర్వి	150	1	5	144
హొళగుంద	189	0	5	184

ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలు



రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించడం, సకాలంలో ప్రభుత్వ సర్వేలు చేసిన వలంటీర్లు పింఛన్ల పంపిణీ సక్రమంగా చేసిన వలంటీర్లకు ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాలు అందిస్తోంది. నేడు ఆలూరు మండల కేంద్రంలో వలంటీర్లను సత్కరించి సేవా అవార్డులు అందిస్తాం. అలాగే వారం రోజుల పాటు ఆయా గ్రామ సచివాలయాల్లోని వలంటీర్లకు పంచాయతీ కార్యదర్శులు పురస్కారాలు అందిస్తారు.

– ఎంపీడీఓ అల్లబకాష్, ఆలూరు

బాధ్యతగా భావించా



నాకు సేవా వజ్ర అవార్డు వరించడం మరింత బాధ్యత పెంచింది. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్నాను. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను పూర్తి చేసి అధికారుల మన్ననలు పొందేందుకు ఈ అవార్డులు దోహదపడతాయి.అధికారులు ప్రజాప్రతినిధులు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు.

– లోకేష్, వలంటీర్, నిట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం

చాలా ఆనందంగా ఉంది



ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి సేవా పురస్కారాలు అందించడం చాలా ఆనందంగా ఉంది. వలంటీర్‌గా మరింత సేవ చేయాలనే సంకల్పం పెరిగింది. ఈ విధానం వలంటీర్ల విధి నిర్వహణకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివక్షకు తావులేకుండా వలంటీర్ల ద్వారా అర్హులందరికీ అందుతున్నాయి. ఇలాంటి వ్యవస్థకు బీజం వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– లక్ష్మిదేవి, వలంటీర్, అరికెర, ఆలూరు మండలం

వినతులకు సత్వర పరిష్కారం

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ రాజు సూచించారు. స్థానిక ప్రజాపరిత్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండలంలో 4 వినతులు వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు నేరుగా ప్రజల దగ్గరకి వెళ్లి సమస్యలకు పరిష్కారం చూపారని వెల్లడించారు.

ఇంటి నిర్మాణం ప్రారంభించండి

మద్దికెర: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణం ప్రారంభించాలని లేని పక్షంలో పట్టా రద్దు చేస్తామని ఏఈ ఉమాకాంత్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలలో 201 మంది లబ్ధిదారులు ఇంతవరకు ఇంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. లబ్ధిదారులకు అందించేందుకు సిమెంటు, స్టీలు, వాకిళ్లు, కరెంటు పైపులు, బాత్‌రూం సామానులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన వెంటనే జియోటాగింగ్ చేసి ఆయా సామగ్రి అందిస్తామన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలని లేదంటే రద్దు చేసి మరొకరికి మంజూరు చేస్తామన్నారు.

'స్టెప్'ను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: ఈనెల 31వ తేదీన గుంతకల్లులోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పడమర రాయలసీమ జోన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిర్వహించే స్టెప్ (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, తల్లిదండ్రులు) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌక్కా సునీల్‌కుమార్ గురువారం తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచితంగా భోజన వసతితో పాటు మెటీరియల్, సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. వివరాలకు 82474 52174, 73827 08455 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి



మాసుమాన్‌దొడ్డిలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారి గుండెల్లో చోటు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 14వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఖాశింబేగ్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నేతృత్వంలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు జీడీపీ నుంచి పట్టణానికి మంచినీటిని సరఫరా చేసేందుకు రూ.142 కోట్లతో పైప్‌లైన్ల ఏర్పాటు చేయనున్నారని తద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయి ఏర్పాటు చేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. వార్డు పరిధిలోని వీధుల్లో డ్రైన్లు, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, సునీల్ కుమార్, షబ్బీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, అమాన్, కేశవరెడ్డి, శివప్రసాద్, కె.విశ్వనాథ్, కోటకొండ నరసింహులు, గట్టుఖాజ, సయ్యద్‌చాంద్, మన్సూర్‌బాష, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: అలాగే గురువారం సాయంత్రం మాసుమాన్‌దొడ్డి గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భీమిరెడ్డి, దీప్తీ రాఘవేంద్ర, వెంకటేష్, తిక్కయ్య, గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



రైతు మిత్ర గ్రూపు సభ్యులకు ట్రాక్టర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇంటింటా సంక్షేమ కాంతులు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో నవరత్నాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి ఇంటిలో సంక్షేమ కాంతులు నింపారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె గురువారం మద్దికెరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు అమ్మ ఒడి, రైతులకు రైతు భరోసా, మహిళలకు వైఎస్సార్ చేయూత, ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో పాటు ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేసే వీధిలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదని రోడ్లు వేయాలని కాలనీవాసులు తెలుపగా రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. సొంతిల్లు లేదని ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరగా అర్హత ఉన్న వారందరికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగరాజు, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

పత్తికొండటౌన్: పంటల సాగులో రైతులు సాంకేతికత, ఆధునిక పద్ధతులు పాటించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. గురువారం పత్తికొండలో.. తుగ్గలి మండలం పెండేకల్లుకు చెందిన కాశింస్వామి రైతుమిత్ర గ్రూపు సభ్యులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మంజూరైన ట్రాక్టర్, నూర్పిడి యంత్రాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. తుగ్గలి వైస్ ఎంపీపీ ఎద్దులదొడ్డి మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అట్లాగోపాల్‌రెడ్డి, చక్రాళ్ల సర్పంచ్ పూరి శ్రీరాములు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఆలూరు ఏపీఓ హేమసుందర్

ఆలూరురూరల్/హాలహర్వి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పని లక్ష్యాలను సాధించాలని హాలహర్వి మండల ఏపీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి కూలీకి రోజుకు రూ.272 వేతనం వస్తుందని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి, మజ్జిగ అందించాలని టీఏలు, ఎఫ్ఏలను ఆదేశించారు. రోజూ పని ప్రదేశంలో ఆన్‌లైన్‌లో మస్టర్ హాజరు వేయాలన్నారు. టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఎఫ్ఏలు అందుబాటులో ఉండాలి

ఉపాధి ఎఫ్ఏలు పని ప్రదేశంలో ఉండాలని ఆలూరు మండల ఏపీఓ హేమసుందర్ అన్నారు. గురువారం ఆలూరు సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఖననం చేసేందుకు స్థలం కోసం ఆందోళన



బి.అగ్రహారంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో మృతదేహాన్ని ఖననం చేసేందుకు స్థలం చూపకపోడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన చాకలి ఆదెమ్మ (70) బుధవారం రాత్రి మృతి చెందింది. గ్రామంలో శ్మశాన వాటిక స్థలానికి సంబంధించి వివాదం ఉండడంతో సాయంత్రం 3 గంటల వరకు మృతదేహాన్ని ఇంటి వద్దే ఉంచారు. కొన్నేళ్లుగా గ్రామ శివారులోని పట్టా పొలంలో గ్రామస్తులు శ్మశానం ఏర్పాటు చేసుకున్నారు. ఆ భూమి యజమాని ఇకపై అక్కడ శవాలను పూడ్చనీయబోనని, తన పొలంలో పంటలు సాగుచేసుకుంటామని గ్రామ పెద్దలకు తెలిపాడు. గ్రామ పెద్దలు తహసీల్దార్‌ను ఆశ్రయించి శ్మశానానికి స్థలం చూపాలని కోరారు. తహసీల్దార్ వేణుగోపాల్ స్పందించి గ్రామ శివారులోని 244 సర్వే నంబర్‌లో 40 సెంట్ల స్థలం చూపించారు. అయితే ఆ స్థలం తనదని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. ఈ పరిస్థితుల మధ్య ఆదెమ్మ దహన సంస్కారాలు నిలిచిపోయాయి. సాయంత్రం కోపోద్రిక్తులైన మృతురాలి బంధువులు గ్రామ సచివాలయం వద్ద శవంతో ధర్నా నిర్వహించారు. వీరికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, కరుణాకర్, బీఎస్పీ నాయకులు మద్దతూ తెలుపుతూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సచివాలయం ముందే ఖననం చేసేందుకు గుంతను తవ్వడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని శ్మశానానికి వేరే చోట స్థలం చూపడంతో వివాదం సద్దుమణిగింది. మృతదేహాన్ని తీసుకెళ్లి ఆ స్థలంలో ఖననం చేశారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు



ఎమ్మిగనూరు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్

ఎమ్మిగనూరురూరల్: జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ గురువారం స్థానిక పట్టణ, ట్రాఫిక్, రూరల్ పోలీసు స్టేషన్‌లను పరిశీలించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో సౌకర్యాలు, సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ క్వార్టర్స్ పరిశీలించి వివరాలను టౌన్ సీఐ మదుసుధన్‌రావును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్, టౌన్ సీఐ మధుసుదన్‌రావు, ఎస్ఐలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సాగునీటి తీరువా చెల్లించండి

హొళగుంద: మండలంలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), సాగునీటి చెరువుల కింద స్థిరీకరించిన ఆయకట్టు భూములు కలిగిన రైతులు ప్రభుత్వానికి సెస్సు కట్టి సహకరించాలని తహసీల్దారు హుసేన్‌సాహెబ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 6 వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, 1,432 ఫసలి వరకు బకాయి ఉన్న సెస్సు దాదాపు రూ.కోటి వసూలు కావాల్సిఉందన్నారు. బకాయిలు చెల్లించి రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

సకాలంలో సేవలందించండి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సర్వీసులను సకాలంలో అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలోని రెండు సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న 543 సేవల్లో కొన్ని సర్వీసుల్లో మార్పులు చేయడం జరిగిందని, ఈ మార్పుల వల్ల వాటిని ఏవిధంగా చేపట్టాలనే దానిపై ఇదివరకే అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు సకాలంలో సేవలందించడంలో అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇక్కడ పరిష్కారం చూపకపోవడం వల్లనే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు వెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారని అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు.

ఆర్బీకే నిర్మాణ పనుల పరిశీలన

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలోని ఆర్బీకే స్లాబ్ పనులను పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. గురువారం గ్రామంలో రైతు భరోసా కేంద్రం నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్, కూలింగ్ పనులను పీఆర్ ఏఈ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఏజెన్సీకి సూచించామన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయాల పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో గురువారం ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించడం, సరైన రికార్డులు లేని 10 మంది వాహనదారులకు రూ.1,350 జరిమానా విధించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఆలూరులో ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌మోహన్

ఆలూరు రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే సంబంధిత ఫర్టిలైజర్, సీడ్స్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ (పత్తికొండ ఏడీఏ) విజయ్‌మోహన్ హెచ్చరించారు. ఆయన గురువారం ఆలూరులోని రాధాస్వామి ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పంట చేతి కొచ్చే వరకు సంబంధిత బిల్లులు, విత్తన ప్యాకెట్లు, పురుగు మందుల డబ్బాలు, ప్యాకెట్లు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు, మందులను అధిక రేట్లకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. షాపుల్లో స్టాక్ బోర్డులు, విత్తనాలు, పురుగుల మందులు, ఫర్టిలైజర్స్ వారీగా రేట్ల పట్టికను ప్రదర్శించాలన్నారు. అనంతరం షాపులో రికార్డులను పరిశీలించారు. ఆలూరు ఏడీఏ సునీత, మండల ఏఓ వెంకటేశ్వర గౌడ్ సిబ్బంది ఉన్నారు.

పొదుపు డబ్బులు స్వాహా

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్లకు చెందిన పొదుపు సంఘాల ఖాతాల నుంచి విలేజ్ బుక్ కీపర్ డబ్బులు స్వాహా చేశాడని సంఘం సభ్యులు లబోదిబో మంటున్నారు. గ్రామానికి చెందిన విజయలక్ష్మి గ్రూపు నుంచి రూ.20 వేలు, వసుంధర గ్రూపు నుంచి రూ.60 వేలు ఇతర ఖాతాకు వీబీకే బసప్ప మళ్లించినట్లు గ్రూపు లీడర్లు రామాంజినమ్మ, మస్తాన్‌బీ, శివమ్మ, దేవమ్మ ఆరోపించారు. ఈ విషయమై తుగ్గలి ఏపీజీబీ మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. గ్రూపు లీడర్లు లేనిదే వీబీకే చెబితే పొదుపు ఖాతాల నుంచి ఇతర ఖాతాలకు డబ్బులు ఎలా మళ్లిస్తారని నిలదీశారు. అనంతరం స్త్రీశక్తి కార్యాలయానికి వెళ్లి వైకేపీ సిబ్బందికి వీబీకే చేసిన మోసాన్ని వివరించారు. విచారణ చేసి స్వాహా సొమ్ము రికవరీ చేయాలని, బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విషయాన్ని ఏపీఎం దృష్టికి తీసుకెళతామని సీసీలు రవి, అంజినేయులు, అంజి గ్రూపు లీడర్లకు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కృష్ణగిరి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలానికి మంజూరైన ఇళ్లలో 40 శాతం ఇళ్లు ఇప్పటి వరకు మొదలు పెట్టలేదని, అలాగే కొన్ని గ్రామాల్లో బేస్‌మెంట్ లెవల్‌లో ఇంటి నిర్మాణాలు నిలిచిపోయారన్నారు. వీటిని త్వరలో ప్రారంభించకపోతే రద్దు చేయడం జరుగుతుందన్నారు. అలాగే బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న వాటిని కూడా నిర్మించకపోతే పట్టా రద్దుచేసి అప్పటివరకు వచ్చిన బిల్లు మొత్తాన్ని లబ్ధిదారుని నుంచి రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగంగా చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో నక్క శ్రీరాములు అనే వ్యక్తి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో బసినేపల్లి గ్రామ కార్యదర్శులు సంజప్ప, పరమేష్, సంక్షేమ అధికారి రంగస్వామి జిల్లా అధికారులకు తెలియజేసి బాధిత కుటుంబసభ్యులకు తక్షణసాయం కింద రూ.10 వేలు అందించారు. మిగతా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

పత్తికొండటౌన్: హిందూ ధర్మాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పత్తికొండలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో వీహెచ్‌పీ ధర్మప్రచార విభాగం గ్రామ సమితి సభ్యుల సమావేశం జరిగింది. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, ఆస్పరి మండలాల నుంచి వీహెచ్‌పీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు ధర్మ పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. మత మార్పిడులను అడ్డుకోవాలని,లవ్ జిహాద్ నుంచి హిందూ యువతులను రక్షించుకోవాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు విశ్వప్రసాద్, ఆర్ఎస్ఎస్ నాయకులు రామలింగయ్య, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.